స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 79 సంచిక 5 1-2-2008 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
99489 95556
చందాలకు
98489 66190


a *** hotel with 5 star comforts
D.R. UTTHAMA HOTEL
Winner of Excellence Award 2004, 2005 & 2006
Nellore - 524 003. Ph: 0861 - 2317777

### ఎమ్మెల్యేలకు ధైర్యం నూరిపోస్తున్న ముఖ్యమంత్రి

# మళ్లీ ప్రభుత్వానికి పాతిక సీట్లే తక్కువ!

రాష్ట్రంలో రాజకీయ గందరగోళం వల్ల కాంగ్రెస్ దెబ్బతింటే, తమ భవిష్యత్తు ఏమిటన్న దిగులుతో సతమతమౌతున్న ఎమ్మెల్యేలను వూరడించడానికి ప్రయత్నాలు మొదలు పెట్టాడు ముఖ్యమంత్రి. ఉధృతమౌతున్న ప్రత్యేక తెలంగాణా ఉద్యమం, చిరంజీవి రాజకీయ రంగప్రవేశం, ప్రభుత్వ అవినీతి పట్ల ప్రజలలో వ్యక్తమౌతున్న హేయ భావం, దిన పత్రికలు చేస్తున్న వ్యతిరేక ప్రచారం, వరంగల్‌లో తెలుగుదేశం సభ దిగ్విజయం కావడం వంటి పరిణామాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలవరపరుస్తున్నాయి. ఎన్నికలకు ముందు రాజకీయ వాతావరణం ఇంత సంక్షుభితమైతే, పార్టీ తీవ్రంగా నష్టపోతుందని; 1994లో వలె రేపు కూడా కాంగ్రెస్ అభ్యర్థులు సామూహికంగా ఓడిపోయే ప్రమాదం వుందని ఎమ్మెల్యేలు భయపడుతున్నారు. బయటపడి మాట్లాడక పోయినప్పటికీ, ఆంతరంగిక సమావేశాలలో, చర్చలలో ఈ అంశం ప్రధానంగా వినవస్తున్నది. రోజు రోజుకు కాంగ్రెస్ నేతలలోనే ఓటమి గుబులు పెరిగిపోవడం మొత్తం పార్టీ యంత్రాంగం నైతికబలాన్ని క్షీణింప చేస్తుందని అర్థం చేసుకొన్న ముఖ్యమంత్రి, నష్ట నివారణకు ప్రయత్నాలు మొదలు పెట్టాడు. తనకు బాగా దగ్గరి వారు, ఆంతరంగికులని నమ్మకం వున్న ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిని పిలిచి, ధైర్యం నూరిపోసే కార్యక్రమం చేపట్టాడు.

తెలంగాణా వల్ల పార్టీకి కొంత సమస్య తప్పదని నాకు తెలుసు; అయితే దాన్ని చూసి భయపడవలసిన అవసరం లేదు. మొత్తం 294 నియోజక వర్గాలలో పార్టీ పరిస్థితి, ఎమ్మెల్యేలు, అభ్యర్థుల పట్ల ప్రజలలో వున్న అభిప్రాయాలపై నేను సమగ్రంగా సర్వే చేయించాను. చాలా లోతుకు వెళ్లి, సూక్ష్మ స్థాయిలో, సునిశితంగా రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేశాను. నా అంచనా కనీసం 125 స్థానాలు కాంగ్రెస్‌కు బలంగా వున్నాయి. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎంత రాజకీయ గందరగోళం జరిగినా, చిరంజీవి దుమారం లేచినా ఈ 125 సీట్లలో గెలుపు ఎవరూ ఆపలేరు. అంటే మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 25 సీట్లు మాత్రమే తక్కువ. గెలుపుకు అవకాశం వుండే దాదాపు 40 స్థానాల మీద ప్రత్యేక దృష్టి పెడుతున్నాను. ఎంత డబ్బు ఖర్చుపెట్టినా, ఏమిచేసైనా ఈ 40 సీట్లలో మన అభ్యర్థులను గెలిపించడానికి వ్యూహం అమలు చేస్తాము. అందువల్ల రేపటి ఎన్నికలలో మళ్లీ గెలుపు మనదే. మీరు అధైర్య పడవద్దు అని నచ్చచెప్తున్నాడు ముఖ్యమంత్రి.

అందుకు ఆయన ఇస్తున్న వివరణ ఎమ్మెల్యేలకు బాగానే నచ్చుతున్నది. పులిచింతల ప్రాజెక్టు కడుతున్నాము కాబట్టి, కృష్ణ, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల రైతాంగం కాంగ్రెస్ పార్టీని దైవ సమానంగా ఆరాధిస్తున్నది. ఆ ప్రాజెక్టు వల్ల కలిగే మేలు అర్థం చేసుకొన్న వారెవరూ మనకు తప్ప వేరొకరికి ఓటు చెయ్యరు. ఆ మూడు జిల్లాలలో చిరంజీవి వస్తే జరిగే కుల సమీకరణలు కూడా రైతులలో మనం తెచ్చుకొన్న మంచి పేరు వల్ల నిష్ఫలమై పోతాయి. రాయలసీమలోని నాల్గు జిల్లాలలో మనకు ఎదురేలేదు. చిరంజీవి వచ్చినా, తెలుగుదేశం ఎన్ని కుప్పిగంతులు వేసినా ఆ జిల్లాలలో మనల్ని ఏమీ చేయలేరు. ఉత్తరాంధ్రలో కొంత ఇబ్బంది వచ్చే అవకాశం వుంది. అయితే ధర్మాన ప్రసాదరావు, బొత్సా సత్యనారాయణ ఇప్పటి నుంచే అందుకు సిద్ధం అవుతున్నారు. వారిద్దరూ గట్టివారు. ఏదో ఒకటి చేసి పార్టీని గట్టెక్కించగల సామర్థ్యం వారికి వుంది. తూర్పుగోదావరి జిల్లాలో మనం బలహీనంగా వున్న మాట వాస్తవం. ఆ జిల్లా మీద నేను ప్రత్యేకదృష్టి పెట్టి పని చేస్తాను. నెల్లూరు జిల్లాను జనార్ధన్‌రెడ్డి చక్కపెట్టగలడు. ఆయనకు స్వేచ్ఛ ఇస్తే అందరినీ ఒక తాటిన నడిపించడమే కాక, తెలుగుదేశాన్ని నిర్వీర్యం చేయగలడు. ఇట్లా ఒక్కొక్క జిల్లా మీద ఒక్కొక్క కోణంలో కృషి చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి, మీరు ధైర్యంగా వుండండి అని చెప్తున్నారు ముఖ్యమంత్రి.

తరువ 14వ పేజీలో

నూతన ప్రారంభోత్సవ ఆహ్వానము
1-02-2008 తేది శుక్రవారము
ఉదయం గం॥ 8-30 నుండి 9-30 ని॥ ల మధ్య
ప్రారంభకులు>>

>> గౌ॥ శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు
సమాచార పౌరసంబంధాల శాఖామాత్యులు

>> గౌ॥ శ్రీ ఆనం వివేకానంద రెడ్డి గారు
శాసన సభ్యులు, నెల్లూరు

>> గౌ॥ శ్రీనెలవల సుబ్రహ్మణ్యం గారు
శాసన సభ్యులు, సూళ్ళూరుపేట
ముఖ్యఅతిథి >>
గౌ॥ యం.పి. పురుషోత్తమన్
చైర్మన్ యం.డి., ఎం.పి. గ్రూప్ ఆఫ్ కంపెనీస్
• డా॥. మహమ్మద్ ఆలీ
కాస్మొటిక్ డెంటల్ సర్జన్
SHINE
Super Speciality Dental Hospital
16-1064, Hotel Venkataramana Lane, Pogathota, Nellore. ☎ 2340032
ఆత్మీయులందరికి మా హృదయపూర్వక ఆహ్వానము

స్థాపితం: 1949 ఫోన్: 2329622
కళ్యాణ శుభకార్యములకు విచ్చేయండి!
కంచి, ధర్మవరం, వెంకటగిరి మరియు ఫ్యాన్సీ చీరలు సరసమైన ధరలకు...
మోహిని స్టోర్స్
ట్రంక్‌రోడ్డు - నెల్లూరు.

లోపలి పేజీల్లో...

- యోగాలో సోమిరెడ్డి.
- ఒంటరైన వివేకా.
- రామనారాయణరెడ్డిలో మార్పు.
- పునర్విభజనపై అసంతృప్తి.
- తహసీల్దార్‌లకు గిరాకీ.

## ఎటిఎంలు మొరాయిస్తున్నాయి

ఖాతాదార్లకు అందుబాటులో వుండేందుకుగాను అన్ని బ్యాంకులు ఎటిఎం సెంటర్‌లను ఏర్పాటు చేశాయి. గూడూరులోనూ వివిధ ప్రాంతాలలో ఎటిఎంలు వున్నాయి. కానీ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంక్, సిండికేట్ బ్యాంకుల ఎటిఎంలు తరచూ మొరాయిస్తుండడంతో నగదు కోసం వెళ్లే ఖాతాదారులు ఇబ్బందులు

### గూడూరులో లబోదిబో

పడుతున్నారు. ఎటిఎం పనిచేయక పోవడం, నగదు లేకపోవడంతో విసిగి పోతున్నారు ప్రజలు. కంప్యూటర్ రిపేర్‌కు వస్తే ముంబాయి నుంచి నిపుణులు రావాల్సి వుందని అధికారులు అంటుండడంతో ఎటిఎంలు దిష్టిబొమ్మల్లా మారాయని ఖాతాదారులు వాపోతున్నారు.

### బుచ్చి పోలీసులు

బుచ్చి పోలీసుల ఆగడాలు, మధ్యస్థాలు, అవినీతి గురించి అనేకమార్లు

కొరవ 14వ పేజీలో



సంగీత, సాహిత్య కళారంగాలకు చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా గణతంత్ర దినోత్సవం నాడు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ రవిచంద్ర చేతుల మీదుగా సత్కరించబడుతున్న బివి.నరసింహం. ప్రక్కనే ఎస్పీ మల్లారెడ్డి వున్నారు.

## గూడూరు డాక్టర్ల మధ్య లడాయి!

గౌరవప్రదమైన వృత్తిలో వుంటున్న డాక్టర్లు విధి నిర్వహణ గాలికి వదిలేసి గొడవలకు దిగుతున్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు, వైద్యులకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. బహిరంగంగా ఒకరినొకరు దూషించుకోవడంతోపాటు ఒకరిపై ఒకరు అవినీతికి పాల్పడ్డా

### వైద్యం మానారు!

రంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకొంటున్నారు. రోగులను పీడించి డబ్బులు గుంజుతున్నారని సూపర్నెంటు అధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ చెన్నయ్య విచారణ చేపట్టారు. తన ముందే డాక్టర్లు, సూపర్నెంటు తిట్టుకోవడంతో బిత్తరపోయిన చెన్నయ్య గొడవలు మాని రోగులకు మంచి వైద్యం అందించండంటూ కారెక్కి వెళ్లిపోయాడు. వైద్యుల గొడవలు తప్పితే రోగులను పట్టించుకొనే వారే లేకుండా పోయారు.

## ఉదయగిరిపై పలువురి కన్ను!

జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజనతో రాజకీయాలు ఊపందుకొన్నాయి. మారిన నియోజకవర్గాల కారణంగా ఉదయగిరి ప్రాంతంపై పలువురు తమ దృష్టి సారించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితోపాటు మాగుంట పార్వతమ్మ ఉదయగిరిపై ప్రేమ పెంచుకున్నారు. ఇప్పటి వరకు కావలిలో ఉన్న జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఉదయగిరిలో కలవడం పార్వతమ్మ ప్రయత్నాలకు కారణమంటున్నారు. తెలుగుదేశంలోనూ లెక్కలేనంత మంది పోటీపడుతున్నారు. పాతకాపు కంభం విజయరామిరెడ్డి, మాదాల

### తెలుగుదేశంలోనే ఆశావహులు జాస్తి

జానకిరాం, వంటేరు వేణుగోపాలరెడ్డి దృష్టి ఉదయగిరిపైనే వుంది. నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గంగా వుండే కమ్మ కుల ప్రాధాన్యం, మారిన పరిస్థితులలో పెరిగిందనే చెప్పవచ్చు. వీరిలో ఎక్కువ మంది టిడిపి ఓటర్లు కావడంతో తెలుగుదేశం పార్టీలో టిక్కెట్లు ఆశించే వారి సంఖ్య పెరిగింది. పాతకాపులతోపాటు మర్రిపాడు మాజీ మండలాధ్యక్షుడు పుట్టం బ్రహ్మానందరెడ్డి, తెలుగురైతు జిల్లా కార్యదర్శి కామేపల్లి వెంకటరత్నం, సీతారామ సాగర్ సాధిస్తానంటున్న బొందల రఘురామరెడ్డి టిక్కెట్ ప్రయత్నాల్లో వున్నారు. అయితే టిడిపి సర్వాధినేత చంద్రబాబు 40 శాతం టిక్కెట్లు క్రొత్తవారికి ఇస్తామంటుండడంతో ఎవరికి దక్కుతుందో నని ఆశగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ప్రస్తుతముంది.



పేద పిల్లలకు ఆపరేషన్లు చేయిస్తున్న చిన్నారి హార్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ కెవి.రత్నంకు తమ విరాళాలు అందిస్తున్న షుగర్ డాక్టర్లు బివిఎస్.రవిశంకర్, వేమిరెడ్డి సురేష్‌రెడ్డి.



కెనడా దేశస్తుడు మాత్యూకోన్‌తో జిల్లా వెలమ సంఘ గౌరవాధ్యక్షుడు, కోగిలి సర్పంచ్ చిట్టిబాబు.

## ఎరువుల కొరతతో సతమతం!

రైతే రాజు, దేశానికి వెన్నెముక రైతులే అని రాజకీయ నాయకులు మైక్ ముందు చేరి దిక్కులు పిక్కటిల్లేలా మాట్లాడుతుంటారు గానీ, ఆచరణలో రైతులను ఆదుకొనేందుకు, వారిని గురించి పట్టించుకొనేందుకు ఏ నేతా వుండడు. అసలే భారీవరదలతో పంటలు దెబ్బతిని ఆర్థికంగా చితికిపోయిన రైతులకు ఎరువులు అందుబాటులో వుండడం లేదు. సొసైటీల్లో వుండాల్సిన ఎరువులు బ్లాక్‌మార్కెటీర్ల చేతుల్లోకి వెళ్లాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. మరీ ముఖ్యంగా బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ప్రైవేట్ డీలర్లు బ్లాక్‌లో

### రైతుల బాధలు పట్టవా?

యూరియా, డుక్కి పిండిలను విక్రయిస్తున్నారు. డిఎపి ధర 486 రూపాయలు వుండగా బ్లాక్‌లో దీనిని 600 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఎరువులు కొనడానికి వచ్చిన రైతులకు డీలర్లు చెప్పే ధర విని కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. విధిలేక ఎరువులను వ్యాపారులు చెప్పిన ధరకే కొనుక్కొని పోతున్నారు రైతులు. ప్రైవేట్ డీలర్ల వద్ద

కొరవ 14వ పేజీలో

## కోగిలి సర్పంచ్ నిజాయితీ!

తనకు దొరికిన విలువైన క్రెడిట్, డెబిట్ కార్డులను, వేల రూపాయల నగదును తిరిగి సంబంధిత వ్యక్తికి అప్పగించి తన నిజాయితీని చాటుకొన్నాడు కోగిలి సర్పంచ్ సోమరాజుపల్లి రాఘవేంద్రరావు(చిట్టిబాబు). కెనడాకు చెందిన మాత్యూకోన్ మన దేశంలో పర్యటిస్తూ జనవరి 25వ తేదీ గూడూరు నుంచి నెల్లూరుకు ఆర్టీసి బస్సులో వస్తూ తన బ్యాగును మర్చిపోయి వెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్న చిట్టిబాబు ఆ బ్యాగ్ చూసి ఆర్టీసి డ్రైవర్, కండక్టర్లకు తెలిపారు. బ్యాగులో విలువైన క్రెడిట్ కార్డులు, నగదు వున్న విషయం తెలుసుకొన్న చిట్టిబాబు ఈ

### విదేశీయుల ప్రశంస

సమాచారాన్ని ఆర్టీసి డిపోలో తెలియజేసి ఎవరైనా వస్తే సంప్రదించమని తన ఫోన్ నెంబర్లు ఇచ్చి వెళ్లారు. ఆర్టీసి సిబ్బంది ద్వారా విషయం తెలుసుకొన్న మాత్యూకోన్, చిట్టిబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన వారి బ్యాగ్‌ను తిరిగి ఇవ్వగా అందులోని వస్తువులు, నగదు చెక్కుచెదరకుండా తనకు అందించిన చిట్టిబాబును, ఆర్టీసి సిబ్బందిని

కొరవ 14వ పేజీలో



బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ ముగింపు సందర్భంగా జరిగిన ఫాతేహా కార్యక్రమంలో కడప పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని. ప్రక్కన ఎమ్మెల్యే వివేకా, గుంటూరు రేంజ్ ఐజి సత్యనారాయణన్, ఎస్పీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ కనకారావు.



# ఎస్కార్ట్ పోలీసుల లంచావతారం!

జైలు నుంచి ఖైదీలను కోర్టు వాయిదాలు, ఆస్పత్రికి తీసుకెళ్లే ఎస్కార్ట్ పోలీసులు లంచాలు మరగడంతో ఇటీవల 10 మంది వీరి కన్ను గప్పి తప్పించుకపోయారు. యాభై, వంద రూపాయలకే ఎస్కార్ట్ పోలీసులు దిగజారడం అసహ్యమనిపిస్తుంది. ఏ వ్యక్తినైనా పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచిన తర్వాత కోర్టు ఆ వ్యక్తిపై వున్న కేసును బట్టి రిమాండ్ చెప్పవచ్చు; బెయిల్ అయినా ఇవ్వవచ్చు. కోర్టు రిమాండ్ చెప్పిన వ్యక్తిని పోలీసులు అదే రోజు సాయంత్రం ఐదు గంటల లోపు జైలుకు తీసుకెళ్లి అప్పగించాలి. ఐదు గంటలు దాటాక జైలు అధికారులు ఆ వ్యక్తిని జైలులోకి అనుమతించరు. అటువంటి సమయాల్లో ఆవ్యక్తిని ఆ రోజు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో వుంచి మరుసటి రోజు ఉదయం జైలు అధికారులకు అప్పజెబుతారు.

ప్రిజినర్ అటెండెన్స్ యాక్ట్ 10 ప్రకారం జైలు నుంచి ఖైదీలను బయ

**బంధువులతో మాట్లాడిస్తారు బార్‌లకు తీసుకవెళ్తారు.**

టకు తీసుకెళ్లిన తర్వాత తిరిగి ఆ ఖైదీలను జైలుకు తీసుకొచ్చి అప్పగించే వరకు ఎస్కార్ట్ పోలీసులదే బాధ్యత. ఎస్కార్ట్ పోలీసులు జైలునుంచి ఖైదీలను తీసుకవచ్చే సమయంలో చేతికి బేడీలు వేసుకొని కోర్టుకు, ఆసుపత్రులకు తీసుక వెళ్లాలి. మార్గ మధ్యమంలో ఎవరినీ వారితో కలవకుండా జాగ్రత్త తీసుకోవాలి. అయితే ఎస్కార్ట్ పోలీసులు డబ్బులు తీసుకొని వారిని స్వేచ్ఛగా వదిలేస్తున్నారు. బంధువులతో మాట్లాడుకొనేందుకు, హోటళ్లలో బిర్యాని తినే వెసలుబాటు ఇస్తున్నారు. 200 రూపాయలిస్తే బేడీలు వేయకుండా ఆటోల్లో తీసుకవెళ్తున్నారు. డబ్బులివ్వకపోతే రోడ్ల వెంట బేడీలతో నడిపించుక వెళ్తారు. పెద్దాసుపత్రిలో ఎస్కార్ట్ పోలీసులు మందు, విందుల్లో మునిగి తేలుతున్నారు. డబ్బు, పలుకుబడి వున్న ఖైదీలు జైలు లోపల, బయట ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నా పట్టించుకొనే అధికారులే లేకుండాపోయారు.



రిపబ్లిక్ డే పెరేడ్ పోలీసు గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రవిచంద్ర.

# నెల్లూరులో స్పేర్‌పార్ట్స్ దొంగలు!

నెల్లూరులో ఇటీవలకాలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. పగలు, రాత్రి అని తేడా లేకుండా వరుస చోరీలు జరుగుతున్నాయి. దొంగలు విచ్చల విడిగా తమ చోరకళను ప్రదర్శించి పోలీసులకు సవాలు విసురుతున్నారు. ఇది చాలదన్నట్లు కొత్తగా స్పేర్‌పార్ట్స్‌ను దొంగిలించే ముఠాలు నగరంలో తిరుగాడుతున్నాయి. జన సంచారం లేని చోట రోడ్లపై, ఇళ్ల ముందు నిలిపివున్న వాహనాల స్పేర్స్‌ను దొంగిలించుకొని వెళ్లడం, పెట్రోలు తీసి వేయడం ఈ ముఠా చేస్తున్న పని. కళాశాలలో చదువుకొనే వారు, తమ జల్సాలకు, ఖర్చులకు డబ్బు అవసరమైన వారు ఈ చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బ్యాటరీలు, ప్లగ్‌లు, టూల్ కిట్, లైట్ డోములను ఈ దొంగలు తస్కరించుకొని వెళ్తుండడంతో వాహనాల యజమానులు లబోదిబోమంటున్నారు.

## మరో ప్రాణం బలిగొన్న సిటీ బస్సు!

నెల్లూరులో తిరిగే సిటీ బస్సుల దూకుడుకు ముక్కుతాడు వేసే వారు లేకుండా పోయారు. జనవరి 26వ తేదీ బైకస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన మస్తాన్ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కొత్తూరు బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బేల్దారి పనిచేసే మస్తాన్ చనిపోవడంతో ఆగ్రహించిన స్థానిక కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు మస్తాన్ మృతదేహంతోనే రోడ్డుపై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు. రోడ్డుపై శవాన్ని పెట్టుకొని ఎండలో స్థానికులు చేస్తున్న ఆందోళన చూపరులను కంట తడి పెట్టించింది. ట్రాఫిక్ పోలీసులు బస్సు యాజమాన్యాల దగ్గర నెల మామూళ్లు తీసుకొంటూ పట్టించుకోకపోవడంతో సిటీబస్సులు కళ్లెలులేని గుర్రాల్లా తిరుగుతున్నాయి. వీటికి ముక్కుతాడు వేసే వారు ఎవరూ లేరా?



బ్రాందీ వ్యాపారులు దిగజారి కూడదు.

# జనవరి 26న బ్రాందీ అమ్మకాలు

జాతీయ సెలవు దినాల్లో మందును ఎక్కడా విక్రయించరాదు. ఎక్సైజ్ పోలీసులు ఎక్కడా బ్రాందీ షాపులు తెరవకుండా చూడాలి. కానీ ప్రతి డ్రైడేనాడు బ్రాందీ అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. జనవరి 26వ తేదీ రిపబ్లిక్‌డే నాడు ఇదే జరిగింది. నెల్లూరు నగరంలో మూలాపేట, రంగనాయకులపేట, తడికల బజార్ సెం

తరువ 14వ పేజీలో


## తృతీయ వర్ధంతి



శ్రీమతి నాయుడు నిర్మల గారు

మంచికి మారు పేరుగా నిలిచి,
అందరికీ అప్యాయతానురాగాలు పంచి పెట్టిన

**శ్రీమతి నాయుడు నిర్మల గారు**

స్వర్గస్తులై 07-02-2008తేది నాటికి మూడు సంవత్సరాలు
గడుస్తున్న సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు చిరశాంతిని
ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

భర్త

**నాయుడు వెంకట నరసారెడ్డి**
(నెల్లూరు)

కుమార్తెలు - అల్లుళ్లు

బాలిరెడ్డి పవిత్ర - డా॥ దుర్గాప్రసాద్‌రెడ్డి, M.Ch.,
కాటంరెడ్డి హేమ - వివేకానందరెడ్డి, M.C.A

మనుమరాలు - మనుమడు

మోక్షదశ్రీ - సుబ్బరామిరెడ్డి

# గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం!

దేశం ఆర్థికంగా పురోగతి చెందాలంటే ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలి. ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలంటే సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించాల్సి వుంటుంది. సురక్షితమైన త్రాగునీరు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పరిఢవిల్లేటట్లు చేయడం ప్రభుత్వ విధి.

సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు, గ్రామీణ ప్రాంతాలు, మురికి వాడలలో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నాయి. ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు ఏమైపోతున్నాయో ఏమో తెలియదు గానీ, గ్రామాల్లో పారిశుద్ధ్యం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా వుంది.

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీరు, పారిశుద్ధ్యం అమలుచేసేందుకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును చేపట్టింది. ఈ పైలట్ ప్రాజెక్టుకు కోట్ల రూపాయలు ప్రతి సంవత్సరం విడుదలవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో కొంత భాగాన్ని త్రాగునీరు అందించేందుకు, మరికొంత భాగాన్ని సంపూర్ణ పారిశుద్ధ్యం కోసం గ్రామ పంచాయితీలకు కేటాయించడం జరుగుతుంది.

పంచాయితీలకు కేటాయించిన నిధులను పారిశుద్ధ్యం పాటించేందుకు ఖర్చు చేయాల్సివుండగా, జిల్లాలో ఏ పంచాయితీ పరిధిలో కూడా ఈ నిధులు ఖర్చు చేయడం లేదు. ప్రభుత్వం నుంచి విడుదల చేసిన నిధులకు కాకి లెక్కలు వ్రాసుకొని సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు జేబులు నింపుకుంటున్నారు.

గ్రామీణ, ప్రాంత ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందకపోవడంతో ప్రజలు పలు రోగాల బారిన పడిపోతున్నారు. అదే విధంగా వ్యక్తిగత పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన లేకపోవడం వల్ల అంటువ్యాధులకు గురవుతున్నారు. దీంతో ఎక్కువ రోజులు జీవనోపాధి కోల్పోతున్నారు.

జిల్లాలో 967 పంచాయితీలు వున్నాయి. వీటిలో సుమారు 500 పంచాయితీలకు పైగా త్రాగునీరు అందని, సరఫరా చేయని గ్రామాలున్నాయి. వ్యక్తిగత పారిశుద్ధ్యం గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించడం, బహిరంగ మల విసర్జన సాంఘిక దురాచారంగా ప్రజలు గుర్తించేటట్లు తెలియజెప్పడం, గ్రామంలో డ్రై లెట్రిన్‌లను నిర్మూలించడం, గ్రామంలో చక్కటి డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు చేయడం, మురికి గుంటలు నిర్మూలించడం వంటివి గ్రామ పంచాయితీల బాధ్యత.




పారిశుద్ధ్య నిధుల స్వాహా కేంద్రం నెల్లూరులోని జిల్లా త్రాగునీరు, పారిశుద్ధ్య కమిటీ కార్యాలయం.

గ్రామ పంచాయితీల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు వారి బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తున్నారు. త్రాగునీరు గ్రామీణులకు అందకపోయినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. పారిశుద్ధ్యం లోపించడం, త్రాగునీరు కలుషితం కావడం వంటి కారణాలవల్ల ప్రజలకు అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయి.

పంచాయితీ సర్పంచ్‌లు, కార్యదర్శులు మాత్రం పారిశుద్ధ్యం కోసం మంజూరు చేసిన నిధులను ఖర్చు చేసినట్లు పైస్థాయి అధికారులకు క్రమం తప్పకుండా నివేదికలు పంపుతుంటారు. ఏ గ్రామంలోకి వెళ్లి పరిశీలించినా పారిశుద్ధ్యం ఎలావుందో కనిపిస్తుంది. పంచాయితీలకు లక్షలాది రూపాయల నిధులు విడుదల చేస్తున్నా 'పైలట్ ప్రాజెక్టు అధికారులు, పంచాయితీలు ఏవిధంగా పారిశుద్ధ్యం అమలు చేస్తుందో, త్రాగునీరు సక్రమంగా సరఫరా చేస్తున్నాయన్న దానిపై పరిశీలించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో లక్షలాది రూపాయలు నిధుల స్వాహా జరిగి పోతూనే ఉంది.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్మల గ్రామాలుగా గ్రామీణ ప్రాంతాలను తీర్చి దిద్దాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

తరువాయి 14వ పేజీలో

సినిమా సమీక్ష

అల్లూరు రహీం

# ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించే స్వాగతం!

సంతోషం, సంబరం వంటి క్లీన్ కుటుంబ చిత్రాల దర్శకుడు దశరథ్‌తో సందడేసందడి చిత్రనిర్మాత ఆదిత్యరామ్ తీసిన చిత్రం 'స్వాగతం' జనరంజకంగా లేదు. ఈ చిత్రంలో రెండులైన్ల సంక్షిప్త కథ ఇమిడి వుంది. గోపిమోహన్ విస్తృత పరుస్తాదన్న స్క్రీన్‌ప్లేను నమ్ముకొని నిర్మాత ఆదిత్యరామ్, దర్శకుడు దశరథ్ దెబ్బతినడంతోపాటు, ప్రేక్షకుల సహనాన్ని ఈచిత్రం పరీక్షిస్తుంది. స్వాగతం కుటుంబ సమేతంగా చూడతగ్గ వినోదాత్మక చిత్రమని విడుదలకు ముందు చెప్పిన, దర్శకుడు హీరోయిన్ అనుష్క అంగాంగ ప్రదర్శనలు, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, రమాప్రభల మధ్య నడిచే చవకబారు సరసాన్ని చూపించడం అవసరమా? ఈచిత్రంలో పాటలు, ఎక్కువ సన్నివేశాలు భారీతనం కోసం అమెరికాలో చిత్రీకరించినా చచ్చు, పుచ్చు కథనం ముందు అవన్నీ నిర్వీర్యమైపోయాయి. హాస్యం కోసం సునీల్, కొండవలస, నల్లశ్రీను, జయప్రకాష్‌రెడ్డి, అలీ, ఎమ్మెస్‌శ్రీరాం, సుదర్శన్, రఘూస్, వేణుమాధవ్‌ల మధ్య సృష్టించిన సన్నివేశాలు పెద్దగా ఆకట్టుకోలేదు. బావుంటే, మనసా చరణాలతో సాగే పాటల్లో హీరోయిన్ అనుష్క ఐటెంగర్ల్‌లా నర్తించింది. ద్వితీయార్థంలో మొదలయ్యే భూమిక ఎపిసోడ్‌లో కాస్త కొత్తదనం కనపడుతుందని ప్రేక్షకులు భావిస్తున్న సమయంలో పలు సినిమాల్లో మాదిరి 'క్రానిక్ లుకేమియా' వ్యాధిని ఆమెకు అంటగట్టి సాగదీసిన వైనం చూడ చక్కగా లేదు. పెళ్లయినా హీరోయిన్ భూమికలో అందాలు ఏమాత్రం చెక్కు చెదరలేదని ఒకరినొకరు, ఊహలపాటే మోహనరాగం పాటలు నిరూపించాయి. తెలుగు, తమిళ భాషల్లో క్రేజున్న హీరో అర్జున్ పెద్ద మనసుతో ఓ క్యారెక్టర్ యాక్టర్‌గా ఈ చిత్రంలో నటించడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. నటుడు, దర్శకునిగా ద్విపాత్రాభినయం చేసే రవిబాబు స్వాగతంలో ఓ కొజ్జాగా నటించడం ఆయనలోని విశాల ధృక్పథానికి నిదర్శనమనవచ్చు.

ఫ్లాప్ సినిమాకు ప్లాటినమ్ డిస్క్ ఫంక్షన్ జరిపినట్లు, జీవితం చాలా అందమైనది, మనిషి ఆశాజీవి కాదు... దురాశాజీవి, మంచిపనికి మంచి ముహూర్తం అక్కర్లేదు వంటి మాటలు ఆలోచింప చేస్తాయి. తెలుగు సినిమా డైరెక్టర్లు ఎక్కడో స్ట్రక్ అయిపోయారని ఈ చిత్రంలో ఒక నటుని చేత చెప్పించే డైలాగ్ ఈ చిత్ర దర్శకుడుకు అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. గత ఏడాది లక్ష్యం వంటి విజయవంతమైన చిత్రంలో నటించిన జగపతిబాబుకు ఈ యేడాది మొదట్లో 'స్వాగతం' తీవ్ర నిరాశ మిగిల్చిన చిత్రమని చెప్పుకోవచ్చు. అందాలు పుష్కలంగా ప్రదర్శించడం మినహా కాస్త నటనకు అవకాశం వున్న 'స్వాగతం' చిత్రంలోని శైలజ పాత్రను అనుష్క అందిపుచ్చుకోలేదు. పాతకథ, కథనంలో నవ్యత లేకపోవడం, సాగతీత కలగలిసిన 'స్వాగతం' చిత్రాన్ని రెండున్నర గంటలపాటు కుర్చొని చూడడం కష్టమే.



'స్వాగతం' చిత్రంలో జగపతిబాబు, భూమిక.

ఇక చిత్ర కథలోనికి వెళ్తే కెకె (జగపతిబాబు) అమెరికా వెళ్లి చీరల షాపు పెడతాడు. అప్పటికే ఆ ప్రాంతంలో ఇటువంటి షాపు నిర్వహిస్తున్న శైలజ(అనుష్క) అతని వ్యాపారాన్ని దెబ్బ తీయను నానారకాలుగా ప్రయత్నించి విఫలమవుతుంది. శైలజ తన బావ డాక్టర్, శ్రీకాంత్(అర్జున్)పై విపరీతమైన ద్వేషాన్ని ప్రదర్శిస్తుంటుంది. తన సోదరిని రోడ్డు ప్రమాదంలో శ్రీకాంతే చంపేసి మరో మహిళను పెళ్లి చేసుకొన్నాడని భావిస్తుంటుంది. అందువల్లే వారి

తరువాయి 14వ పేజీలో



# మళయాళానికి సదా!

నితిన్ సరసన సదా నటించిన టక్కరి చిత్రం బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టడంతో సదా నిరుత్సాహపడిపోయింది. నితిన్‌తో కలసి సదా తెలుగు తెరపైకి రంగప్రవేశం చేసిన 'జయం' సూపర్‌హిట్ తర్వాత ఆమెకు చాలా అవకాశాలే వచ్చాయి. తమిళంలో శంకర్ తీసిన అపరిచితుడులో ఆమె నటించగల్గింది. అయితే ఈ చిత్రం బాగా ఆడినా ఆమె కెరీర్ వెనక్కి తగ్గడం మొదలయ్యింది. తెలుగులో సదా నటించిన చిత్రాలన్నీ ఫ్లాపయ్యాయి. దీంతో తాజాగా ఆమె మళయాళంపై దృష్టి నిలిపింది. ఇటీవల ఆమె నటించిన నావెల్ చిత్రం కేరళలో విడుదలైంది. ఈ విషయమై మాట్లాడుతూ గత. మూడేళ్లుగా నాకు మళయాళంలో ఆఫర్లు వస్తూనే వున్నాయి. కానీ తమిళ, తెలుగు చిత్రాలలో బిజీగా వున్నందువల్ల నేను మళయాళ సినిమాల్లో నటించలేకపోయాను. మంచి ఆఫర్లు వస్తే మరిన్ని సినిమాల్లో నటించేందుకు సిద్ధమేనని చెబుతోంది. ఒక వైపు మళయాళ ముద్దుగుమ్మలు ఇక్కడికి వస్తుంటే; అవకాశాల్లేని సదా, కేరళ వెళ్లడం సబబేనేమో! బెస్ట్ ఆఫ్ లక్ సదా.



# అమ్మ చెబితే ఓకే!

తెలుగులో కోటి రూపాయలు పారితోషికం తీసుకొన్న నటిగా పేరుగాంచిన ఇలియానా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఇలియానాను తెలుగులో అవకాశాలు కోకొల్లలుగా వున్నా బాలీవుడ్ ఎందుకు వెళ్లారంటే; నన్ను వెండితెరపై అందంగా చూపించింది తెలుగు పరిశ్రమ. కానీ బాలీవుడ్ పెద్ద పరిశ్రమ. నాలాంటి మధ్య తరగతి అమ్మాయి అందివచ్చిన అవకాశాన్ని వదులుకొంటే ఎలా? నేనేం పనిచేసినా అందులో నాదే పైచెయ్యిగా వుండాలని కోరుకొంటా. బాలీవుడ్‌లోనూ నిలదొక్కుకొంటానన్న ధైర్యం వుంది. నేను ఎంత బిజీగా వున్నా ఇంటికి వెళ్లగానే అమ్మ ఒడిలో పడుకొంటాను. వెంటనే ఎంతో స్వాంతన చేకూరుతుంది. నాకు మా అమ్మే స్ఫూర్తి. సృష్టికి అమ్మే మూలం. నన్ను ఈ విషయంలో అమ్మకూచి అనుకొన్నా పరవాలేదంది ఇలియానా.



# పచ్చ బొట్టుతో రా... రాజా!

ప్రియురాలు అడిగితే కాదనే ప్రియుడెవరు? అయితే అందాల నాయిక కరీనాకపూర్ తన ప్రియుడు సైఫ్ అలీ ఖాన్‌ను ఒక కోరిక కోరిందట. సైఫ్‌కు కరీనాపై ఉన్న ప్రేమతో చేతికి 'క' అని పచ్చబొట్టు వేయించుకొన్నాడట. ఇద్దరూ ఏకాంతంగా వున్న సమయంలో సైఫ్, కరీనాకు ఈ విషయం చెప్పాడట. అది విన్న వెంటనే ఆమె కరీనా అని పేరు మొత్తాన్ని పచ్చబొట్టు వేయించుకోమని సెలవిచ్చిందట. 'క' అని వ్రాయించుకొనే ఇబ్బందులు పడుతున్న సైఫ్‌కి ఈ కోరిక విన్న వెంటనే ఏం చేయాలో పాలుపోలేదట. వేయించుకుంటే చూసిన వారు ఏమనుకుంటారో... వేయించుకోకపోతే కరీనా ఎక్కడ దూరమవుతుందో అని సైఫ్ తెగ మదన పడుతున్నాడట. మొత్తం మీద చెలి కోరిక సైఫ్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. ప్రియురాలా మజాకా?

# సత్తాచూపిన తనుశ్రీదత్తా!

హీరోయిన్ తనుశ్రీదత్తా ఓ తెలుగు చిత్రంలో నటించింది. హిందీ చిత్రం కోసం ఫైట్స్ నేర్చుకొన్న ఆమెకు అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. డిశంబర్ 31వ తేదీ బెంగుళూరులోని ఓ క్లబ్‌లో తనుశ్రీ డ్యాన్స్ చేసింది. ప్రోగ్రాం గ్రాండ్ సక్సెస్ అని సంబర పడుతున్న తరుణంలో ఒక ఆకతాయి తనుశ్రీ చేయి పట్టుకొని లాగి నానా హంగామా సృష్టించాడు. అంతలోనే తేరుకొని తనుశ్రీ అతడి చేతిని వదిలించుకొని చెంప చెళ్లుమనిపించింది. తాను నేర్చుకొన్న కరాటేతో అతన్ని కుమ్మేసింది. అనుకోని ఈ పరిణామానికి అక్కడి వారంతా నిర్ఘాంతపోయారు. ఆ తర్వాత అమ్మో అందగత్తె అన్నారట!





# సోనమ్‌కు అవకాశాల వెల్లువ

సంజయ్‌లీలా భన్సాలీ తీసిన సావరియా చిత్రం హిట్ కాకపోయినా ఈ చిత్రంలో హీరోయిన్ సోనమ్‌కపూర్‌కు మాత్రం అవకాశాలు ఆగడం లేదు. ఢిల్లీ-6 చిత్రంలో ఆమె ఏకంగా అభిషేక్ బచ్చన్ సరసన నటిస్తుంది. ఈ సినిమా షూటింగ్ రాజస్థాన్‌లో జరుగుతోంది. ఇటీవల ఆమెకు మరో మంచి ఛాన్స్ వచ్చింది. హృతిక్‌రోషన్ హీరోగా రాకేష్‌రోషన్ తీయనున్న చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా అడిగారట. ఈ విషయమై రాకేష్‌రోషన్, సోనమ్ తండ్రి అనిల్‌కపూర్‌ను కలిసారట. ఈ అవకాశం గూర్చి వినగానే అనిల్‌కపూర్ సంతోషంగా అంగీకరించాడట. సావరియాలో సోనమ్ నటన చూశాక రాకేష్‌రోషన్ ఆమెకు ఈ అవకాశం ఇచ్చాడని విమర్శకులంటున్నారు. ఈ చిత్రం స్క్రిప్ట్ వర్క్ ప్రస్తుతం జరుగుతుంది.

Registered : RN 1156 / 57 No. PLG / NL / 9 - 8 / 06





# పంచమ వర్ధంతి

స్వయం కృషితో అభివృద్ధిలోకి వచ్చి ఎల్ల వేళలా మా అభివృద్ధిని కాంక్షించి
మమ్ము తన గుండెలలో దాచుకున్న ప్రేమ మయుడు, మా ఇంటి ఇలవేల్పు





జననం
2-12-1931

మరణం
5-2-2003

# శ్రీ గూడూరు భాస్కరరామిరెడ్డి గారు

(మాజీ మున్సిపల్ కౌన్సిలర్, నెల్లూరు)

మీరు మా మధ్యలేరన్న నిజాన్ని నమ్మలేకున్నాం.
మీరు భువిలో వున్నా, దివిలో వున్నా మీ ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష

భార్య : గూడూరు రత్నమ్మ

కుమారులు - కోడళ్లు : గూడూరు మాధవరెడ్డి - అనిత
గూడూరు మహేష్‌రెడ్డి M.Tech., M.S., (U.S.A) - శ్రీదేవి B.Tech., (U.S.A)

కుమార్తె : ఎస్.మైథిలి

మనుమలు - మనుమరాండ్రు : శివరూపేష్, లక్ష్మీలాస్య, సాయిమనితేజ, అక్షిత్ (U.S.A), బావిక్ (U.S.A)

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.